ప్రజాశక్తి
గురువారం 12 జనవరి 2023
5
విజయనగరం



అక్షర జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోండి

ఆర్ఐఒకు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

చీపురుపల్లి మండలంలో గల శ్రీ అక్షర జూనియర్ కళాశాల యాజమాన్యం ప్రభుత్వ విధానాలకు విరుద్ధంగా పూర్తిగా నిర్మాణం కాని భవనంలో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నందున అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం అర్ఐఒకు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులు వేలకు వేల ఫీజులు కడుతున్నప్పటికీ మౌలిక వసతులు కల్పించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. విద్యార్థినులకు మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేదన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.



వ్యక్తి రాజకీయాలను పట్టించుకోకపోయినా, వ్యక్తులను రాజకీయాలు ప్రభావితం చేస్తునే ఉంటాయి. ఇందులో మంచిచెడ్డలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పాలకులు మంచి మార్గాన్ని ఎంచుకోకపోయినా, అటువంటి పరిస్థితుల్లో యావత్తు ప్రజానీకం ప్రశ్నించకపోయినా పరిపాలన పక్కదారి పడుతుంది. అలాంటి పరిణామాలు అడ్డుకోకపోతే రాజకీయాలు వ్యక్తులనే కాదు, సమాజాన్నే శాశిస్తాయి. ప్రస్తుతం అటువంటి పరిస్థితే ఎదురైంది మన జిల్లాకుగానీ, రాష్ట్రానికిగానీ, చివరికి దేశానికిగాని. పాలకుల విధానాల వల్ల అత్యధికంగా యువశక్తి నిరుపయోగంగా మారుతోంది. ముఖ్యంగా స్వార్థరాజకీయాలు పెరగడంతో జన జీవనమే దినదినగండంగా మారుతోంది. ఇటువంటి సందర్భంలో (జనవరి 12న) జాతీయ యువజన దినోత్సవానికి ఎంతో ప్రాధాన్యత ఉంది.

యువతా మేలుకో..!

- పెరిగిన స్వార్థరాజకీయాలు
- దోపిడీని పెంచుతున్న ప్రభుత్వ విధానాలు
- నిలదీయకపోతే అగమ్యగోచరమే
- నేడు జాతీయ యువజన దినోత్సం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో యువజన జనాభాయే ఎక్కువగా ఉంది. స్థానికంగా తగినన్ని విద్యాసంస్థలు లేవు. ప్రస్తుతం నూతన విద్యావిధానం పేరిట పాఠశాలలను కూడా కుదిస్తున్న సంగతి విధితమే. ఉన్నత విద్యకోసం ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. దీనికితో ఆర్థికంగా వెనుకబడిన జిల్లా. తల్లిదండ్రుల రెక్కల కష్టం తిండికి, వైద్యం, చదువు సంధ్యలకే సరిపోని పరిస్థితి. తీరా చదువుకున్నాక ఉద్యోగాలు, ఉపాధి మార్గాలు దొరకడం లేదు. చదువుకున్న పాఠ్యాంశాలు ఒకటి, ఉద్యోగ సందర్భాల్లో తీసుకుంటున్న ప్రామాణికాలు మరొకటి. తల్లిదండ్రులను పోషించాల్సిన వయసులో ఉద్యోగాల వేటలో దేశ, విదేశాలు వలసపోవాల్సిన పరిస్థితి. ఆర్థిక స్థోమత లేనివారు కూలి పనులతో సరిపెట్టుకోవాల్సిన దుస్థితి. మన జిల్లాల్లో ఇప్పటికీ ఉపాధి హామీ పనులకు వెళ్తున్న బిటెక్, బిఎస్‌సి, బిఇడి చదువుతున్న యువకులు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. అంతకు మంచి ఆటోమొబైల్ రంగంలో చిన్నపాటి ఉద్యోగం కావాలన్నా విశాఖ, విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలకు పోవాల్సిన దుస్థితి దాపురించింది. మరోవైపు రాజకీయాల్లో జవాబుదారీతనం, పారదర్శకత పూర్తిగా లోపిస్తున్నాయి. రాజకీయం అంటే సేవచేయడం అనే అర్థానికి బదులు ఆర్థికంగా డబ్బులుంటేనే రాజకీయ నాయకులమౌతామని పరిస్థితి వచ్చేసింది. ఇటువంటి తరుణంలో యువత రాజకీయాలపట్ల పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో కుటుంబ రాజకీయాలు పెరిగాయి. ఆర్థికంగా అవకాశం ఉన్నవారు మాత్రమే రాజకీయాల్లో ప్రవేశించి, ఎన్నికల వేళ ఖర్చుచేసిన మొత్తానికి రెట్టింపు రాబట్టుకునేందుకు దిగజారిన పరిస్థితులు చూస్తున్నాం. ఇటువంటివారు చట్టసభల్లోకి వెళ్లడం వల్ల ప్రజలకు వ్యతిరేకంగాను, దోపిడీకి, యువజను శక్తిని నిర్వీర్యం చేసే దిశగా నిర్ణయాలు జరిగిపోతున్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని వర్గాలవారూ పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల దోపిడీకి గురౌతునే ఉన్నారు. ఇటువంటి తరుణంలో యువత కేవలం క్రీడలు, సేవా కార్యక్రమాలకే పరిమితం కాకుండా 'కాలేజీ కుర్రవాడ కులాసాగ తిరిగినోడ... విలసాల మాట మరువరో.. ఓ విద్యార్థి విప్లవాలమాట నడవరో' అన్నట్టుగా సమాజంలో జరుగుతున్న దోపిడీ విధానాలపై గొంతెత్తాల్సిన అవసరం ఉంది. యువతీ యువకులు అటువంటి బాట పడతారని ఆశిద్దాం.



13న శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-విజయనగరం

ఈ 13న శిల్పారామం వేదికగా సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ ఎ. సూర్యకుమారి పేర్కొన్నారు. తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడేలా సంబరాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సంక్రాంతి సంబరాల ఏర్పాట్లు, వివిధ పోటీల నిర్వహణ తదితర అంశాలపై బుధవారం అధికారులతో జూమ్ ద్వారా సమావేశమయ్యారు. రంగ వల్లుల పోటీలు, తెలుగు వస్త్రధారణ పోటీలు నిర్వహించాలని చెప్పారు. ఆ రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు సంబరాలను నిర్వహించాలని సూచించారు. పండగ శోభ సంతరించుకునేలా శిల్పారామాన్ని ముస్తాబు చేయాలని, ఆకర్షణీయంగా ఉండేలా రంగురంగుల ముగ్గులు వేయించాలని చెప్పారు. పిల్లలు, పెద్దలు వచ్చి ఆనందంగా గడిపేలా సంగీత కచేరీలు, ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని చెప్పారు. భోగి మంటలు వేసి ఆడిపాడేలా, హరిదాసు వేషాలతో అలరించేలా, ఎడ్లబండి ప్రదర్శనతో ఉత్సాహ పరిచేలా.. తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడేలా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

12న ముగ్గుల పోటీలు, 13న వస్త్రధారణ, వంటల పోటీలు

సంక్రాంతి సంబరాల నేపథ్యంలో ఈ నెల 12న మధ్యాహ్నం 2గంటల నుంచి 4 గంటల వరకు శిల్పారామంలో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే సంబరాల రోజు అనగా 13వ తేదీ ఉదయం నుంచి వస్త్రధారణ, వంటల పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తతీయ బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. పోటీల్లో పాల్గొనే వారు సంబంధిత మెటీరియల్ వారే తెచ్చుకోవాలని తెలిపారు.



బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

ప్రయాణికులతో కిటకిట

ప్రజాశక్తి-విజయనగరం కోట

సంక్రాంతి నేపథ్యంలో విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వడంతో విద్యార్థులంతా స్వగ్రామాలకు బయలుదేరారు. మరోవైపు దూర ప్రాంతాల నుంచి గ్రామాలకు వచ్చేవారి సంఖ్య పెరిగింది. ఉపాధి, ఉద్యోగాల కోసం సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు సంక్రాంతి పండగకు సొంతూళ్లు చేరుతున్నారు. ఈనేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్‌టిసి కాంప్లెక్సు ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి, రాజాం,పాలకొండ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో బుధవారం బస్సులన్నీ కిక్కిరిసిపోయాయి. మరోవైపు తగినన్ని బస్సులు లే గంటల తరబడి నిరీక్షించారు. చాలా సమయంతో తరువాత వచ్చిన బస్సులను ఎక్కేందుకు సీట్ల కోసం పోటీ పడ్డారు.



బస్సులో సీట్ల కోసం ప్రయాణికుల పాట్లు



కలెక్టరేట్ వద్ద బిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

గ్రీన్ అంబాసిడర్ల బిక్షాటన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

'పండగ పూటా పస్తులుండాలా? మా బకాయి వేతనాలు చెల్లించండి' అంటూ సిఐటియు ఆధ్వర్యంలో గ్రీన్ అంబాసిడర్లు బుధవారం కలెక్టరేట్ వద్ద బిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఖాళీ పల్లాలు పట్టుకొని అయ్యా బిక్షం అంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 2430 మంది గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులు, డ్రైవర్లు గ్రామీణ ప్రాంతాలను శుభ్రం చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని తెలిపారు. కానీ ప్రభుత్వం వారి వేతన బకాయిలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు మాత్రం వస్తులతో గడుపుతున్నాయని ఆవేదన చెందారు. స్వచ్ఛ భారత్ స్కీమ్‌లో భాగంగా గత ఏడాది మార్చి వరకు జీతాలు ఇచ్చారని, 919 మందికి 4 నెలలు నుంచి 22 నెలలు జీతాలు చెల్లించుకుండా ఆ కార్మికులతో వెట్టిచాకిరీ చేయిచుకుంటున్నారని అన్నారు. వీరంతా బడుగు బలహీన వర్గాలకి చెందిన పేదలని, వీరందరికి 2022 ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు బకాయి ఉన్న 6 నెలలు జీతాలు ఇవ్వలనీ కేంద్రప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ పంచాయతీలకు సర్క్యులర్ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆ ఉత్తర్వులు ప్రకారంగా మన జిల్లాలో పూర్తి స్థాయిలో ఏ పంచాయితీలోనూ సక్రమంగా అమలు చేయలేదని తెలిపారు. ఎస్.కోట మండలం కొట్టాం గ్రామపంచాయితీలో కార్మికులకు వచ్చిన జీతాలలో రిక్షా రిపేర్లకు అని చెప్పి నలుగురు కార్మికుల నుంచి ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.4వేలు చొప్పున వసూలు చేశారని, వసూలు చేసిన సర్పంచ్ పైనా, సెక్రటరీ పైనా చట్టపరమైన చర్యలు తీసుకుని ఆ డబ్బులు కార్మికులకు ఇప్పించాలని డిమాండ్ చేశాఉ. బకాయి డబ్బులు కార్మికులకు ఇప్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆక్రమ తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, నాయకులు బి.రమణ కార్మికులు పాల్గొన్నారు.

24 వేల మంది బాధితులు.. రూ.8 కోట్లు టోకరా

పప్పుల చిట్టీ నిందితులు అరెస్టు

రూ.1.28కోట్లు రికవరీ : ఎస్‌పి ఎం.దీపిక

ప్రజాశక్తి-విజయనగరం

సంక్రాంతి కానుక (పప్పుల చిట్టీ) పేరుతో జిల్లాలో వివిధ ప్రాంతాల్లో సుమారు 24వేల మంది నుంచి డబ్బులు వసూలు చేసి మోసగించిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.1,28,33,073 విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి ఎం.దీపిక వెల్లడించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

పప్పుల చిట్టీ పేరుతో డబ్బులు వసూలు చేసిన కేసులో ప్రధాన నిందితుడు కొండకరకాం గ్రామానికి చెందిన మజ్జి అప్పలరాజు, మజ్జి రమేష్, కొండగుంపాంకు చెందిన పతివాడ శ్రీలేఖ బృందంగా ఏర్పడి సంక్రాంతి పండుగకు 24 రకాల సరుకులు ఇస్తామని ఒక్కొక్కరి నుంచి నెలకు రూ.300 చొప్పున వసూలు చేశారని తెలిపారు. ఇందుకుగాను వివిధ గ్రామాల్లో 189మంది ఏజంట్లను నియమించుకొని సుమారు 24వేల మంది నుంచి వసూళ్ళకు పాల్పడ్డారన్నారు. ఈ తరహా చిట్టీని 2021లో నిందితులు ప్రారంభించి, రూ.8,09,74,300 మొత్తాన్ని వసూలు చేశారని తెలిపారు.

ప్రధాన నిందితుడు అప్పలరాజు విజయవాడలో వాటర్ ప్లాంట్ కొత్తగా పెట్టేందుకు రూ.3.5 కోట్లను పెట్టుబడిగా పెట్టాడని, సకాలంలో ప్లాంటు ప్రారంభం కాకపోవడంతో చిట్టీ కట్టిన వారికి సరుకులు అందించలేకపోయారని తెలిపారు. బాధితులు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. అరెస్టయిన నిందితుల నుంచి రూ.15.18 లక్షల విలువైన 297.710 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ. 44,12,900 నగదు, రూ.29,95,000 విలువైన భూముల డాక్యుమెంట్లును స్వాధీనం చేసుకోవడంతో పాటు, 5 బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ. 39,06,326 నగదును ఫ్రీజ్ చేసామన్నారు. ఇవి కాకుండా వీరి పేరున 16 వాహనాలు, రెండు వాటర్ ప్లాంట్లు ఉన్నట్లుగా గుర్తించామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న భూముల మార్కెట్ విలువ ఎక్కువగానే ఉంటుందని, వీటిని కోర్టులో దాఖలు చేసి, విచారణ అనంతరం కోర్టు వారి అనుమతితో బాధితులకు అందజేస్తామని ఎస్‌పి తెలిపారు. కేసు దర్యాప్తుకు ప్రత్యేక అధికారులను నియమించిన రాష్ట్ర డిజిపి ఈ పప్పుల చిట్టీ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన కేసు విచారణను మరింత లోతుగా దర్యాప్తు చేసేందుకు అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు, డిఎస్పీ అర్జునరావు అనే అధికారులను ప్రత్యేకంగా నియమించారని తెలిపారు. అధిక వడ్డీలకు ఆశపడి మోసపోవద్దని ప్రజలను ఎస్‌పి కోరారు. ఆస్తులను రికవరీ చేయుటలో ప్రధాన భూమిక పోషించిన చీపురుపల్లి ఇన్ చార్జ్ డిఎస్‌పి బి.మోహనరావు, గుర్ల ఎస్ఐ శిరీషలను ఎస్‌పి అభినందించారు.



స్వాధీనం చేసుకున్న నగదు, నగలు; నిందితులను చూపుతున్న ఎస్‌పి, డిఎస్‌పి

ప్రయాణికుల సౌకర్యార్థం రైల్ కోచ్ రెస్టారెంట్

డిఆర్ఎం అనూప్‌కుమార్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించడానికే కార్తికేయ ఫుడ్ వరల్డ్ రైలు కోచ్ రెస్టారెంట్ ను ప్రారంభించినట్లు విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ కుమార్ శతపతి తెలిపారు. బుధవారం విజయనగరం రైల్వే స్టేషన్‌లోకార్తీక్ ఫుడ్ వరల్డ్ రైల్వే కోచ్ రెస్టారెంట్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే స్టేషన్ ఆధునికీకరణలో భాగంగా ప్రయాణికుల సౌకర్యార్థం దీన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వేపరిధిలో ఇది మొదటిది కాగా ఆంధ్రప్రదేశ్‌లో రెండోదని తెలిపారు. ప్రయాణికులకు ఆహార ఇబ్బందులు లేకుండా నాణ్యమైన భోజనాలు అందించడానికి ఇది దోహద పడుతుందన్నారు. ఫుడ్‌కోర్టును ఏడాదికి రూ.16లక్షలకు ఐదేళ్ల లీజుకు ఇచ్చామన్నారు. రెస్టారెంట్ 24 గంటలు సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రయాణికులు ఈ సదుపాయాలను ఉపయోగించుకోవాలని కోరారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో 8 ప్రత్యేక రైళ్లను విజయనగరం మీదుగా ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సీనియర్ డిసిఎం త్రిపాటి, విజయనగరం స్టేషన్ మాస్టర్ మురళీకృష్ణ, కమర్షియల్ మేనేజర్ ప్రసాద్, ఫుడ్ వరల్డ్ రెస్టారెంట్ ఓనర్ కె.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న డిఆర్ఎం అనూప్‌కుమార్

స్వయం ఉపాధికి సువర్ణావకాశం

జగనన్న తోడు నిధులు విడుదలలో కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

చిరు వ్యాపారాలు చేసుకునే వారికీ, సాంప్రదాయ హస్తకళల కళాకారులకు ప్రభుత్వం అందిస్తున్న జగనన్న తోడు 6 వ విడత నిధులు లబ్ది దారుల ఖాతాలలో రాష్ట్ర ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి బుధవారం వర్చువల్ గా నిర్వహించిన కార్యక్రమం ద్వారా జమ చేసారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎలాంటి బ్యాంకు గ్యారంటీ లు లేకుండా సులభతరంగా రుణాలు మంజూరు చేస్తున్నామని, , క్రమం తపకుండా తిరిగి చెల్లించి ప్రతి సంవత్సరం వెయ్యి రూపాయలను అదనంగా పొందాలని లబ్ది దారులను ఉద్దేశించి చెప్పారు. ఈ కార్యక్రమం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసారం కాగా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ సూర్య కుమారి, శాసన మండలి సభ్యులు డాక్టర్ సురేష్ బాబు, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, మెప్మా పీడీ సుధాకర రావు, లబ్దిదారులు పాల్గొన్నారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేసారు. అనంతరం జిటల్లా కలెక్టర్ సూర్య కుమారి పాత్రికేయులతో మాట్లాడుతూ జిల్లాలో జగనన్న తోడు 6 వ విడత వడ్డీ రాయితీ కింద 29, 279 మంది లబ్ది దారులకు రూ.61.12 లక్షలు లబ్ది చేకూరిందని తెలిపారు. రుణం మంజూరు ద్వారా 7,591 మంది లబ్ది దారులకు 7.59 కోట్ల రూపాయల లబ్ది చేకూరిందని తెలిపారు. ఇప్పటి వరకు 6 విడతలలో 83,758 మంది చిరు వ్యాపారులకు, సాంప్రదాయ వృత్తిదారులకు రూ.10 వేలు చొప్పున రూ.83.75 కోట్లు వడ్డీ లేని రుణాలు మంజూరు చేశామన్నారు. రుణ సహాయం కింద 1,20,607 మంది చిరు వ్యాపారుల బ్యాంకు ఖాతాల్లో 276.18 లక్షలు వడ్డీ జమ చేశామన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రుణాలు పొందిన వారు 90 శాతం వరకు తిరిగి చేలిస్తున్నారని, ఇది శత శాతం కావాలని అన్నారు. క్రమం తప్పకుండా రీ పే చేసే వారికి సివిల్ స్కోర్ పెరగడం వలన ఇతర రుణాలు కూడా బ్యాంకుల నుండి పొందగలుగుతారని తెలిపారు.



చెక్కును అందిస్తున్న కలెక్టర్‌సూర్యకుమారి, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని వివిధ ప్రాంతాల్లో రహదారుల ప్రారంభోత్సవాలు, పార్కు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి చేపట్టారు. సింగపూర్ సిటీ వద్ద రూ.16 లక్షలతో ఏర్పాటు చేసిన రహదారిని, కాలనాయుడు మందిరం వద్ద రూ.16 లక్షలతో ఏర్పాటు చేసిన రహదారిని ప్రారంభించారు. 34వ డివిజన్లో రూ.22 లక్షలతో నిర్మించ తలపెట్టిన పార్కు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు, పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, కార్పొరేటర్లు అల్లు చాణక్య, ఆల్తి సత్యకుమారి, గుజ్జల నారాయణరావు, కాళ్ళ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్కు నిర్మాణానికి శంకుస్థాపన

34వ డివిజన్‌లో బ్యాంక్‌కాలనీ ప్రాంతంలో ఉన్న పార్కు నిర్మాణానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శంకుస్థాపన చేశారు. పక్కనే ఉన్న మరో పార్కు పనులు పూర్తి కావడంతో లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కో ఆర్డినేటర్ కృష్ణంరాజు మాట్లాడుతూ 17ఏళ్ల క్రితం పార్కు అభివృద్ధికి కృషి చేసిన కోలగట్ల మళ్లీ పార్క్ పునర్నిర్మాణానికి రూ.22 లక్షతో అభివృద్ధి చేశారని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ బాలి పైడిరాజు, జివి రంగారావు, వైసిపి నాయకులు రవిచంద్ర, రెడ్డిగురుమూర్తి, బాలి ప్రతాప్, బాలి నరేంద్ర పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి

విజయనగరం కోట : సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందజేయడమే లక్ష్యంగా వాజి ఛానల్ గత 27ఏళ్లుగా రంగోలి పోటీలను నిర్వహిస్తోందని వాజీ ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం తమ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఈనెల 12న ఆనందగజపతి ఆడిటోరియంలో రంగోలి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది రంగోలీ పోటీలలో 4 లక్షల 50 వేలరూపాయల విలువగల 750 బహుమతులను విజేతలకు అందిస్తామన్నారు. ఈ పోటీలలో ముగ్గు వేసే ప్రతి ఒక్కరికి బహుమతి అందిస్తామన్నారు. బహుమతి ప్రదానోత్సవంలో ప్రముఖ టీవీ, సినీ ఆర్టిస్ట్ జ్యోతిరాయ్ (గుప్పెడు మనసు ఫేం జగతి) పాల్గొననున్నారు. 12వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఆనందగజపతి ఆడిటోరియంలో వాజీ రంగోలీ, హౌసీ విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని చెప్పారు. డిసెంబర్ 31న వాజీ మెగా హౌసీలో ఫుల్ హౌసీ అయి, పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులు నేరుగా ఆనందగజపతి ఆడిటోరియంలో జరిగే బహుమతి ప్రదానోత్సవానికి హాజరు కావాలని సూచించారు.

ధాన్యం కొనుగోలులో పురోగతి సాధించాలి : జెసి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియలో మరింత పురోగతి సాధించాలని, ఆ దిశగా సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో వ్యవహరించి తగిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. ఇప్పటి వరకు 2.42లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగిందన్నారు. అయితే అక్కడక్కడా చిన్నచిన్న సమస్యలు తలెత్తుతున్నాయని.. వాటిని పరిష్కరించి మరింత పురోగతి సాధించాలని నిర్దేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ఇతర అంశాలపై బుధవారం తన ఛాంబర్లో వివిధ విభాగాల అధికారులతో ఆయన సమీక్షించారు. కొనుగోలు ప్రక్రియ పూర్తయిన తర్వాత సమీపంలో ఉన్న మిల్లులకు ధాన్యం చేరుకొనేలా తగిన చర్యలు తీసుకోవాలని, సరిపడా వాహనాలను అందుబాటులో ఉంచాలని చెప్పారు. నిర్దేశించిన లక్ష్యాలమేరకు ధాన్యం సేకరించేలా మండల, గ్రామ స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేయాలని జిల్లా అధికారులకు సూచించారు. తక్కువ సేకరణ జరిగిన చోట్ల ప్రత్యేక దృష్టి సారించి ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. ధాన్యం, రవాణా భత్యానికి సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు చెల్లించాలని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ ఆర్‌బికెలను, మిల్లులను తనిఖీ చేయాలని చెప్పారు. సమావేశంలో సివిల్ సప్లయ్ డిఎం మీనాకుమారి, డిఎస్ఒ సుదర్శన్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథ స్వామి, ఉద్యానశాఖ డిడి జమదగ్ని, రవాణా శాఖ ఉప కమిషనర్ పాల్గొన్నారు.

వ్యవసాయ యంత్రపరికరాల ధరలు ఖరారు

వివిధ రకాల వ్యవసాయ యంత్ర పరికరాలకు సంభందించి, జిల్లా ధరల నిర్ణాయక కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. కమిటీ ఛైర్మెన్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో, వివిధ పరికరాల ధరలపై అధీకృత డీలర్లు, తయారీదారులతో చర్చించారు. ట్రాక్టర్ తో కలిపి ఉపయోగించే 9 పళ్ళ నాగలి సెట్, దమ్ము సెట్ హాఫ్ కేజ్ వీల్, హాఫ్ కేజ్ వీల్, చదును చేసే బ్లేడ్, గుంటక బ్లేడ్, రెండు పళ్ళ నాగలి, పది పళ్ళ దంతి తదితర పరికరాల ధరల నిర్ణయం పై వారితో చర్చించారు. వేర్వేరు కంపెనీల డీలర్లు, తయారీదారులు కోట్ చేసిన ధరలను, ఖరారు చేయడానికి ప్రభుత్వానికి పంపిస్తామని జెసి తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి త్రినాథస్వామి, ఉద్యాన శాఖాధికారి జమదగ్ని, అగ్రోస్ డిఎం ప్రసాదరావు, అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

మిషన్ అంత్యోదయపై అవగాహన సదస్సు

వేపాడ : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ బిహెచ్‌కెహెచ్ పట్నాయక్ మిషన్ అంత్యోదయ సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో చేపట్టవలసిన అంశాలను జాగ్రత్తగా గుర్తుంచుకోవాలన్నారు. ఈ అవగాహన సదస్సులో మండల పంచాయతీ విస్తరణ అధికారి సూర్యనారాయణ, డిజిటల్ అసిస్టెంట్లు, వివోఏలు పాల్గొన్నారు.

రైతులకు ఇకెవైసి పూర్తి చేయాలి

గజపతినగరం: అర్హత ఉన్న రైతులకు ఇకెవైసి పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి త్రినాధ స్వామి అన్నారు. బుధవారం స్థానిక సబ్ డివిజన్ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించిన ఈ పంట నమోదును ఫిబ్రవరి 15లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సంవత్సరం ప్రభుత్వం చిరుధాన్యాల సంవత్సరంగా ప్రభుత్వం గుర్తించిందని రైతులకు చిరుధాన్యాల సాగులో యాజమాన్య పద్ధతులను, కొత్త రకాలపై అవగాహన కల్పించి వివిధ కార్యక్రమాలు చేపట్టి చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ ప్రకాష్, గజపతినగరం సహాయ వ్యవసాయ సంచాలకులు కె.మహేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారులు సి.హెచ్.ధనలక్ష్మి, మల్లికార్జున్, టెక్నికల్ ఎ.ఒ లోకేష్, పాల్గొన్నారు.



జిఒ ఒకటి కాపీలను దగ్ధం చేస్తున్న సిఐటియు నాయకులు

నిరంకుశ జిఒను రద్దు చేయాలి: సిఐటియు

బొబ్బిలి: రహదారిపై సభలు, సమావేశాలను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నిరంకుశ జిఒ ఒకటిని రద్దు చేయాలని బొబ్బిలి సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌టిఆర్ బొమ్మ వద్ద బుధవారం జిఒ కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, మానవ హక్కులను రక్షించాలంటే జిఒ ఒకటిని వెంటనే రద్దు చేయాలన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు రహదారుల పైనే వేలాది మందితో పాదయాత్ర చేసి, బహిరంగ సభలు పెట్టి అధికారంలోకి వచ్చారని సంగతి మరిచిపోవద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జి. గౌరీ, ఉపాధ్యక్షులు బి. వెంకటి కార్మికులు పాల్గొన్నారు.

దత్తిరాజేరు: కోమటిపల్లి ఆటో స్టాండ్ వద్ద సిఐటియు జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి, ఆధ్వర్యంలో జీవో ఒకటి కాపీని దహనం చేశారు. ప్రభుత్వ నిరంకుశ చర్యలను ఖండించారు. రాజ్యాంగం కల్పించిన హక్కును కాలరాయడం జగన్మోహన్‌రెడ్డికి తగదని అన్నారు. అనంతరం సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు జెండాను ఎగురవేశారు.

గంజాయి నివారణకు చర్యలు తీసుకోండి

బొబ్బిలి : గంజాయి అమ్మకాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన డిమాండ్ చేశారు. కోటలో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ బొబ్బిలి, పరిసర ప్రాంతాల్లో గంజాయి అమ్మకాలతో యువత జీవితాలు నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక లాభాలు కోసం కొంతమంది వ్యక్తులు గంజాయి అమ్మి యువత జీవితాలను నాశనం చేస్తున్నారన్నారు. గంజాయి, మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని కోరారు. గంజాయి తాగిన, అమ్మిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గవద్దని పోలీసులను కోరారు. గంజాయి అమ్మకాలు, తాగిన వారు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయి అమ్మిన వారిని సమాజం నుంచి బహిష్కరణ చేయాలని కోరారు. గంజాయిపై మెతక వైఖరి అవలంబించొద్దని పోలీసులు, ప్రభుత్వాన్ని కోరారు. గంజాయి అమ్మకాలపై తన వద్ద కొంత సమాచారం ఉందని, పోలీసులకు ఇస్తామన్నారు.

తైక్వాండో పోటీల్లో పతకాలు కైవసం

బొబ్బిలి : సౌత్ ఇండియా తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలలో బొబ్బిలి క్రీడాకారులు బంగారు, వెండి పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ నెల 6 నుంచి 8 వరకు హైదరాబాద్ కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన తైక్వాండో పోటీలలో బొబ్బిలి పట్టణానికి చెందిన రెడ్డి సృజన బంగారు, రెడ్డి శృతికీర్తన వెండి పతకాలను కైవసం చేసుకున్నారు. వీరిద్దరిని టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ బేబినాయన అభినందించారు. తైక్వాండో పోటీలలో ప్రతిభ కనబరిచి బంగారు, వెండి పతకాలను కైవసం చేసుకోవడం ఆనందంగా ఉందని బేబినాయన అన్నారు. కార్యక్రమంలో కోచ్ సుధాకర్ ఉన్నారు.

కత్తెర పురుగు నివారణపై అవగాహన

బొబ్బిలిరూరల్ : మండలంలోని అలజంగి గ్రామంలో బుధవారం కత్తెర పురుగు నివారణకు ఎడి యం.శ్యాం సుందర్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా పంటను పరిశీలించి అనంతరం మాట్లాడారు. మొక్కజొన్న పంటను కత్తెర పురుగు నాశనం చేస్తుందన్నారు. ప్రధానంగా ఈ గ్రామంలో మొదటి సారిగా మొక్కజొన్న పంట వేసి ఉన్నారని ఆయన తెలిపారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురగు నివారణ కోసం ఇమామెకిన్ బెంజోయేట్ 100 గ్రాములు, వేప నూనె 500 ఎంఎల్ఎ ఎకరానికి 12 ట్యాంకులు చొప్పున పిచికారి చేసుకోవాలన్నారు. రెండో విడత ఎరువు కింద ఎకరానికి 50 కేజీలు యూరియా, 25 కేజీల మ్యూరేట్ ఆఫ్ పటాస్ వేసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు పైల వేణు, గ్రామీణ వ్యవసాయ సహాయకులు పెంట లత తదితరులు పాల్గొన్నారు.

సర్వే వేగవంతం

రేగిడి : పిఎంజెఎవై ఆయుష్మాన్ భారత్ సర్వేను వేగవంతం చేయాలని ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాధరావు ఆదేశించారు. బుధవారం చిన్న శిర్లాం, అంబాడ వెంకటాపురం సచివాలయాలలో పిఎం-జెఎవై ఆయుష్మాన్ భారత్ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య బీమా ప్రభుత్వం ద్వారా నిధులు సమకూరుస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగ ఆసుపత్రులలో వైద్య చికిత్సల నిమిత్తం ఆయుష్మాన్ భారత్‌లో చేరాలని తెలిపారు. ఎంపానెల్డ్ సెకండరీ, తృతీయ సంరక్షణ ఆసుపత్రిలో చేరడానికి ప్రతి కుటుంబానికి ఏడాదికి రూ.5 లక్షలు కవరేజీ ఉంటుందన్నారు. ఈ ఆయుష్మాన్ భారత్‌ను పేద ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈయనతోపాటు ఏవిపురం సర్పంచ్ చుక్కా వెంకట నాయుడు, ఆయా గ్రామాల సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

కాలువ నిర్మాణ పనులు పరిశీలన

రేగిడి : మండలంలోని సంకిలి గ్రామంలో జరుగుతున్న కాలువ నిర్మాణ పనులను సర్పంచ్ బుడుమూరు పట్టాభి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రవళిక బుధవారం పరిశీలించారు. 130 మీటర్లకు సంబంధించి రూ.5.20లక్షల 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మాణ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. సంకిలితో పాటు బొడ్డవలస, చిన్నయ్య పేట గ్రామాల్లోఉపాధి హామీ పథకం, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.60 లక్షలతో నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని గుత్తేదారులకు సూచించారు.

కొలతల ప్రకారం పని చేస్తేనే గిట్టుబాటు

రేగిడి : కొలతల ప్రకారం ఉపాధి హామీ పథకం పనులు చేస్తే కూలి గిట్టుబాటు అవుతుందని ఎపిఒ సంకాబత్తుల హరినాథ్ అన్నారు. బుధవారం మండలంలోని చిన్న శిర్లాం పంచాయతీలో బారికవాని చెరువు పనులను ఆయన పరిశీలించారు. ముందుగా మస్తర్లను తనిఖీ చేశారు. కూలి గిట్టుబాటుపై కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొలతలు ప్రకారం పనిచేస్తే రూ. 257 వస్తుందని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఎన్ఎంఎంఎస్ యాప్‌లో కూలీల మస్తర్, ఫోటోలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేస్తేనే వేతనాలు వస్తాయన్నారు. పనులు వద్ద అన్ని రకాల సదుపాయాలూ కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ చిరంజీవికి సూచించారు.

సంక్రాంతి కానుకలు పంపిణీ

బొబ్బిలి రూరల్ : సి.హెచ్ బొడ్డవలస పంచాయితీ పరిధిలోని కృపావలస గిరిజనులకు దళిత, గిరిజన ఐక్యవేధిక కన్వీనర్ సౌరు సాంబయ్య ఆధ్వర్యంలో బుధవారం సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సి.హెచ్. రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న గిరిజనులకు ప్రభుత్వ పరంగా సహకరిస్తామన్నారు. సాంబయ్య మాట్లాడుతూ గిరిజనులకు ఆధార్, ఓటు కార్డులు లేవని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిసా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు క్లవ్, గిరిజనులు పాల్గొన్నారు..

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



గజపతినగరం: ఉపాధ్యాయులకు సోది చెబుతున్న బాలిక

జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో బుధవారం ఘనంగా విద్యార్థులు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగీ మంటలు వేశారు. హరిదాసు వేషధారణలతో అలరించారు. విద్యార్థులంతా సాంప్రదాయ వస్త్రాలు ధరించి అలరించారు.

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని ఎపి మోడల్ స్కూల్లో ప్రిన్సిపల్ సిహెచ్ సంధ్య ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు మాట్లాడుతూ సాంప్రదాయాలకు అనుగుణంగా సంక్రాంతి సంబరాలు విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ముందుగా పాఠశాలలో భోగిమంటలు వేసి విద్యార్థినిలతో స్వాగతం పలుకుతూ పలు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్య కమిటీ చైర్మన్ ముద్దాడ రాము, గంట్ల సర్పంచ్ రామన్ రాజు, రఘుమండ సర్పంచ్ గూడేల విష్ణు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


వేపాడ : మండలంలోని బక్కు నాయుడుపేట వద్ద గల బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈనెల 12వ నుండి వసతి గృహాలకు సెలవులు ఇస్తున్నందున నేపథ్యంలో ముందే సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఇందులో భాగంగా వసతి గృహంలో విద్యార్థులందరూ భోగి మంటలు వేసి ప్రాచీన ఆచారాల పాటిస్తూ వసతి గృహం ఆవరణలో చక్కని వాతావరణాన్ని కల్పించి రంగవల్లు వేసి గొబ్బెమ్మలు ముగ్గులపై పెట్టి ఆనందోత్సాహంగా విద్యార్థినిలు గడిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉషారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో.. మండల కేంద్రంలో గల విక్టరీ హైస్కూల్‌తో పాటు జెడ్‌పి పాఠశాల, ఎంపిపి పాఠశాల యుపి పాఠశాల బుధవారం ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: మండలంలోని భవాని నగర్‌లోని గౌరీ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రాచీన సాంప్రదాయాలు విద్యార్థిని విద్యార్థులకు తెలిసే విధంగా సోదమ్మ, గంగిరెద్దు, హరిదాసు కీర్తనలు, నృత్యాలతో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాంద్రేగుల వెంకట రాము, సాంస్కృతిక కార్యక్రమాల ఇంచార్జి రమేష్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు. స్థానిక నారాయణాస్ కేంబ్రిడ్జ్ పాఠశాలలో తెలుగు వెలుగుల పెద్ద పండుగ, సంక్రాంతి సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిహెచ్ శేషు, పాఠశాల ఎజిఎం యం.శివరాం, ఆర్.ఐ. రవికుమార్, పాఠశాల ఎ.జి.యమ్ శ్రీనివాసరావు, డీన్ శ్రీరామమూర్తి, వైస్ ప్రిన్సిపాల్స్ ఎఎన్ఆర్.లక్ష్మి, రోజా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నా రు. పట్టణంలోని సర్వేపల్లి పాఠశాలలో సంక్రాంతి సంబ రాలను బుధవారం పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ సన్యాసి రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

బొండపల్లి: మండలంలోని గొట్లాం గాయత్రీ పాఠశాలలో బుధవారం ముందస్తుగా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత ఎరుకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

గరివిడి: స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో బుధ వారం ఘనంగా సంక్రాంతి పండుగ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు సాంప్రదాయ దుస్తులను ధరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జాషువా జయప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ బి. వెంకట రమణ పాల్గొన్నారు.



వేపాడ: హరిదాసు వేశదారణలో విద్యార్థి

లక్కవరపుకోట: మండల కేంద్రంలో ఉన్న స్వామి వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాలలో విద్యార్థినీ విద్యార్థులు పలు సాంస్కృతి కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థినిలచే నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశారు. గోపికల వేషధారణతో పాటు ఆరో తరగతి చదువుతున్న ఇల్లపు కిషోర్ వేసిన హరిదాసు వేషధారణ ప్రత్యేకంగా పలువురును ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో కరాటే కోచ్ రాజు మాస్టర్, ఉపాధ్యాయులు మోటూరు నాగభూషణ్, చదరం స్వాతి, ఇల్లపు మాధవి, కె. కవిత, పల్ల నాగమణి, పి. గంగాభవాని పాల్గొన్నారు.

గజపతినగరం: హర్షవర్ధన హైస్కూలు, సాయి గౌతమ్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో అలరించారు. హర్షవర్ధన స్కూలు కరస్పాండెంట్ వివి ప్రదీప్‌కుమార్ , సాయి గౌతమ్ స్కూలు కరస్పాండెంట్ ఎస్.ఎస్ నాయుడు ఆధ్వర్యాన చిన్నారులకు పలు పోటీలు నిర్వహించారు.



ఎల్‌కోట: ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

విజయనగరం టౌన్ : రింగురోడ్డు వద్ద గల నారాయణ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సంస్కతి సాంప్రదాయా లను విద్యార్థులకు తెలియజేసే విధంగా కార్యక్రమాలు నిర్వహిం చారు. భోగిమం టలు, రంగవల్లులు వేశారు. హరిదాసు వేషధారణ ద్వారా విద్యార్థులకు హరి కీర్తనలు వినిపించారు.

ఫోర్టు సిటీ పాఠశాలలో..ఫోర్టుసిటీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. భోగి, సంక్రాంతి, కనుమ పండగల ప్రాముఖ్యతను, పండుగ జరుపుకొనే విధానాన్ని విద్యార్థులు నృత్య రూపంలోను, నాటికల రూపంలోను ప్రదర్శించారు. పాఠశాల విద్యార్థులతో పాటు కొంతమంది ఉపాధ్యాయులు కూడా ఈ నృత్యాలలో పాల్గొని సంక్రాంతి సంబరాలను గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె.ఎ.పి.రాజు (శివ), పాఠశాల వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ గిరిజారాణి, అకాడమిక్ అడ్వయిజర్ రోయినాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ పాల్గొన్నారు.

సత్యా కళాశాలలో : స్థానిక తోటపాలెంలో గల సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణరావు భోగిమంటలను వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థినులకు రంగోలి పోటీలు, గాలిపటాల పోటీలు, తెలుగమ్మాయి తెలుగు అబ్బాయి పోటీలు నిర్వహిం చారు.అనంతరం విద్యార్థులు సంక్రాంతి పాటల డాన్సుల తో అలరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఎం. వి.సాయి దేవ మణి, అధ్యాపకులు, పాల్గొన్నారు.

గాయత్రి కళాశాలలో: విజయనగరం తోటపాలెం గాయత్రి మోడల్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థుల వేశదారణలు పలువురును ఆకట్టుకున్నాయి. డైరెక్టర్లు అల్లు ఆదినారాయణ, నరేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



డెంకాడ: భోగి మంటలు వేస్తున్న ఉపాధ్యాయులు



విజయనగరం: పోర్టు సిటీ స్కూల్లో హరిదాసు వేషదారణ



ఎస్‌కోట: సాంప్రదాయ వస్త్రదారణలో విద్యార్థులు

వైసిపి పాలనలో వెనుకబడిన రాష్ట్రం

ప్రజాశక్తి - శృంగవరపుకోట

వైసిపి పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడి రాష్ట్రం వెనుకబడిందని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆరోపించారు. బుధవారం మండలంలోని తిమిడి, గంగిరెడ్లపాలెంలో టిడిపి మండల అధ్యక్షులు జిఎస్ నాయుడు ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జగన్ పాలనపై ప్రజలు విసుగెత్తి ఉన్నారని ఏ క్షణం ఎన్నికలు వచ్చిన వైసిపి ఓడిపోవడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాయవరపు రవి శంకర్, తిమ్మిడి పంచాయితీ ఉపాధ్యక్షుడు బర్ల స్వామి నాయుడు, పి.నాగు, గండి శ్రీను, విశాఖ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కాపుగంటి శ్రీనివాసు, ఐటీడిపి రాష్ట్ర సెక్రెటరీ కిరణ్, చిన్ని కృష్ణ పాల్గొన్నారు.



డెంకాడ: ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

డెంకాడ: మండలంలోని అక్కివరం గ్రామంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించే రోజులు దగ్గర పడ్డాయన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు కంది సురేష్, వార్డుమెంబర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు బొబ్బాది జయరాం తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మనిషికి ఆరోగ్యమే ప్రధానం

శృంగవరపుకోట : మనిషికి ఆరోగ్యం కన్నా మరేది ప్రధానం కాదని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. బుధవారం మండలంలోని కిల్తంపాలెం పంచాయితీ భర్తాపురం గ్రామంలో విజయనగరం వికాస తరంగిణి మహిళా ఆరోగ్య వికాస్, శ్రీ శ్రీనివాస ఛారిటబుల్ ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో మహిళా ఆరోగ్య వికాస్ ఉచిత ఆరోగ్య శిబిరం ప్రారంభోత్సవంలో త్రిదండి అహోబిల జీయర్ స్వామితో కలిసి సతీసమేతంగా ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సుధారాజు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి హాజరైన మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్సీ మాట్లాడుతూ, ఆరోగ్యం కాపాడుకోవడం జీవితంలో అత్యంత ప్రాధాన్యమైనదని, మనిషికి ఆరోగ్యం కన్నా మరేదీ ప్రాధాన్యం కాదని, మనం ఆరోగ్యంగా ఉన్నపుడే ఈ జీవితాన్ని చివరి వరకు ఆనందంగా గడపగలుగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, స్థానిక సర్పంచ్ సుంకరి ఈశ్వరరావు, ఉప సర్పంచ్ కండేల రాము, పెదఖండేపల్లి సర్పంచ్ యాళ్ళ రమణ, ఎంపిటిసి బోదల దేముడు, మాజీ ఎంపిపి ఒంటి అప్పారావు, స్థానిక వార్డు మెంబర్లు రామమోహన్, హరి, నాయకులు సుంకరి బుల్లి, వర్మ రాజు, మండలానికి చెందిన మాజీ సర్పంచులు కె.వెంకటరావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి

కుళాయి పనులకు శంకుస్థాపన

వేపాడ : మండలంలోని రామస్వామి పేట గ్రామంలో ఇంటింటి కుళాయి పనులకు ఎంపిపి సత్యవంతుడు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో ఇంటింటి కుళాయి పనులకు రూ. 18లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో త్వరగా పనులు పూర్తి చేసి కుళాయిల ద్వారా గ్రామస్తులకు తాగునీటిని అందించాలని కోరారు. అనంతరం గ్రామస్తులు ఎంపిపితో పాటు వైస్ ఎంపిపిలు అడపా ఈశ్వర్‌రావు, ముత్యాలను ఘనంగా సత్కరించారు.

క్రీడలతో మానసిక వికాసం

ప్రజాశక్తి - కొత్తవలస

గ్రామీణ క్రీడలు మానసిక వికాసాన్ని పెంపొందిస్తాయని ఎస్ కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. కంటకాపల్లి వద్ద శారద ఫెర్రో ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో చేపట్టిన వాలీబాల్ క్రీడలు బుధవారంతో ముగిసాయి. ఈ క్రీడల ముగింపు కార్యక్రమంలో కంపెనీ ఎండి శారదా నీరజ్‌తోపాటు ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల స్థాయిలో వాలీబాల్ క్రీడలు పెట్టడం ఆనందంగా ఉందన్నారు. ఈ క్రీడల్లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడు విజయం సాధించినట్టే అని ఎమ్మెల్యే అన్నారు. గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. కంపెనీ ఎండి శారదా నీరజ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కంపెనీ నుంచి క్రీడలు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ క్రీడల్లో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా మొదటి బహుమతి రూ.లక్షను గులివిందాడ జట్టుకు, రెండవ బహుమతి రూ.50వేలను తుమ్మికాపల్లి జట్టుకు, మూడవ బహుమతిగా అద్దాలపాలెం జట్టుకు రూ. 10వేలు అందించారు. కాగా క్రీడల్లో పాల్గొన్న ప్రతి టీంకు రెండు బంతులు ఒక నెట్టు ఉచితంగా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కంపెనీ సీనియర్ జనరల్ మేనేజర్ ప్రభాత్ మోహన్, జిఎం శత్రుఘ్న సింగ్, డిజిఎం చంద్రశేఖర్, హెచ్‌ఆర్‌డిజిఎం హెచ్. సన్యాసిరావు, రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, పిఎసిఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, స్థానిక సిఐ ఎస్. బాల సూర్యారావు, వాలీబాల్ కోచ్‌లు గవర సూరిబాబు, కృష్ణంరాజు, రిఫరీ ఎల్‌జిఎన్ కుమార్, కంటకాపల్లి, కాటకాపల్లి సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస: విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే

క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభం

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల క్రీడ మైదానంలో సంక్రాంతి సందర్భంగా బుధవారం ఎస్‌కోట క్రికెట్ లీగ్ పోటీలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రారంభించారు. క్రికెట్ పోటీలు ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్సీ బ్యాటింగ్ చేయగా ఎమ్మెల్యే వికెట్ కీపర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాధం, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ, నాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

ప్రజాశక్తి- మెంటాడ

ధాన్యం సేకరణలో నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. సూర్యనారాయణ సిబ్బందిని హెచ్చరించారు. మెంటాడ రైతు భరోసా కేంద్రంలో ధాన్యం సేకరణ జరుగుతున్న తీరును ఆయన బుధవారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ధాన్యం సేకరణ జరపాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ధాన్యం సేకరణ సిబ్బందికి సూచించారు. 8వ తారీఖున ట్రక్ సీటు తీయించి 11వ తారీఖున ధాన్యం పంపడంపై సిబ్బందిపై ఆయన ఆహగ్రం వ్యక్తం చేశారు. మీ తీరు మారకపోతే ఇంటికి పంపిస్తానని హెచ్చరించారు. ఆర్‌బికె సిబ్బంది, వాలంటీర్లు, రైతుల కల్లాల్లోకి వెళ్లి శాంపిల్స్ సేకరించి, ఆ తరువాతనే ట్రక్ సీటు జనరేట్ చేయాలని, ముందస్తుగా ట్రక్ సీటు జనరేట్ తీయడం పట్ల అత్యుత్సాహం దేనికని మండిపడ్డారు. ధాన్యం సేకరణ విషయంలో రైస్ మిల్లు వద్ద ఆర్ఐ, సిఎస్‌డిటి, విఆర్ఒలను ఉంచామని ధాన్యం సేకరణ విషయంలో ఎలాంటి ప్రలోభాలు జరిగిన సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ధాన్యం సేకరణ సిబ్బంది, సిఇఒ ప్రసాద్, ఆర్ఐ, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

రైతులను ఆదుకోండి : లోక్‌సత్తా

బొబ్బిలి : ఉమ్మడి విజయనగరం జిల్లాలో వరి తర్వాత అత్యంత ప్రాధాన్యత గల వాణిజ్య పంటలైన చెరకు, గోగు పండించే రైతుల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని వారిని ప్రభుత్వం ఆదుకోవాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర రావు అన్నారు. బుధవారం ఆయన చెరకు రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ బొబ్బిలి పరిసర ప్రాంతాలలో ఒకప్పుడు చెరకు, గోగు పంటలను ఎక్కువగా పండించే వారని, ఇతర రాష్ట్రాలకు కూడా మన దగ్గర పండించిన గోగును ఎగుమతి చేసే సందర్భాలు మనం చూసామని అన్నారు. ప్రస్తుతం ఈ రెండు పంటలు సాగు పూర్తిగా తగ్గి పండించే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భవిష్యత్తులో ఈ రెండు పంటలు పూర్తి స్థాయిలో కనుమరుగయ్యే పరిస్థితి కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితికి ప్రభుత్వ విధానాలే ప్రధాన కారణమన్నారు. త

వికలాంగ విద్యార్థుల భవితకు భరోసా

శృంగవరపుకోట : వికలాంగ విద్యార్థుల భవితకు రాష్ట్ర ప్రభుత్వం భరోసాని స్తుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు అన్నారు. మండల కేంద్రంలో గల భవిత కేంద్రంలో ఎంఇఒ పి. సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం వికలాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 22 మందికి ప్రభుత్వం సుమారు రూ.2.74 లక్షలు విలువ గల వినికిడి పరికరాలు, ట్రైసికిల్స్ పంపిణీ చేసిందన్నారు. ప్రత్యేక అవసరాలు పిల్లలకు ట్రాన్స్‌పోర్టు, ఎస్కార్ట్, హోమ్ బేస్డ్, రీడర్, స్టయిఫండ్ ఫర్ గర్ల్స్ అలవెన్స్‌ను ప్రభుత్వం ఇస్తుందన్నారు. అనంతరం జిల్లా కోఆర్డినేటర్ సూర్యారావు మాట్లాడుతూ జిల్లా మొత్తంలో రూ.29 లక్షల విలువైనటువంటి ఉపకరణాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, భవిత కేంద్రం సిబ్బంది, పోక్సో స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, షేక్ రెహమాన్, కడారి అప్పయ్య, కడారి జయశంకర్, మోపాడ కోటి, పి.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

96 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

బొబ్బిలి: బాడంగి మండలం కోడూరు గ్రామానికి చెందిన సీ చంద్రయ్య మద్యం సీసాలను రామభద్రపురం నుంచి అక్రమంగా తరలిస్తుండగా కోడూరు వద్ద బుధవారం పట్టుకున్నామని బొబ్బిలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిఐ ఆర్. జైభీమ్ తెలిపారు. ఆయన వద్ద నుంచి 96 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మద్యం సీసాల అక్రమ రవాణాకు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసకున్నామని, మద్యం సీసాలను పెద్ద మొత్తంలో విక్రయించిన వైన్‌షాప్ సేల్స్ మెన్ అశోక్ పై కూడా కేసు నమోదు చేశామని చెప్పారు.

వంగర : మండలంలోని కింజంగి గ్రామానికి చెందిన వేమిరెడ్డి తిరుపతిరావును అరెస్టు చేసినట్లు ఎస్ఐ బుడుమూరు లోకేశ్వరరావు బుధవారం తెలిపారు. సదరు వ్యక్తి గ్రామంలో తన ఇంటి వద్ద 17 మద్యం బాటిల్లతో పట్టుబడడంతో ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి పాలకొండ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

బీమా అందజేత

నెల్లిమర్ల :మండలంలోని కొండవెలగాడలో కోట్ల పైడిరాజు, బాలి అప్పలనారాయణలకు జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు బుధవారం వైఎస్ఆర్ బీమా చెక్కులను అందించారు. ఒక్కొక్కరికి రూ.లక్ష చెప్పున అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ప్రభుత్వం ఎల్లప్పుడూ ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మొయిద అక్కోజీ, వల్లూరి రాము, పంచాయతి కార్యదర్శి వై. రమణ, వెల్ఫేర్ అసిస్టెంట్ కె. గోవిందరావు పాల్గొన్నారు.

జరజాపుపేటలో లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట ఒకటివ సచివాలయంలో భారత రెండవ ప్రధాని భారతరత్న లాల్ బహదూర్ శాస్త్రి 57వ వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, వైసిపి నాయకులు తుమ్ము నారాయణ మూర్తి, నల్లి శ్రీను, మద్దిల వాసు, సచివాలయం సెక్రెటరీలు పాల్గొన్నారు.

IN THE HONORABLE COURT OF THE MACT CUM 4TH ADDITIONAL DISTRICT JUDGE AT SRIKAKULAM (SC&ST COURT)
I.A 267/2021IN MVOP 398/2014

Between: **మజ్జి మనోహర్ రావు**
..పిటిషనర్/పిటిషనర్

And: **ఎం. వెంకట సత్యనారాయణ వర్మ రాజు**
మరియ ఇతరులు ..రెస్పాండెంట్స్/రెస్పాండెంట్స్

To, Proposed R4. **శ్రీమతి బి విజయలక్ష్మి** W/o బీవీ రమణ రాజు **AP35U9809** బస్సు ఓనర్, తోటపాలెం, విజయనగరం టౌన్,జిల్లా.

పై నెంబర్ గల కేసులో పిటీషనర్ మీపై కేసు వేసియున్నారు. బస్సు ప్రమాదంలో తనకు తగిలిన గాయాలకు నష్టపరిహారము నిమిత్తము ఈకేసులో మిమ్మల్ని రెస్పాండెంట్స్‌గా చేర్చమని పిటిషన్ **I.A267/2021** వేసి ఉన్నారు. సదరు పిటీషన్‌లో మీకు నోటీసు నిమిత్తము తేదీ **25-01-2023 వాయిదా యున్నది** కావున ఆ దినము అనగా తేదీ **25-01-2023 ఉదయం 10 గంటల 30 నిమిషాలకు** మీరు స్వయంగా గాని లేక మీ న్యాయవాది ద్వారా కానీ పై కోర్టులో హాజరు కావలెను లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించడం అగునని ఈ నోటీసు ద్వారా మీకు తెలియజేస్తున్నాము.

ఇట్లు
కంచరాన వెంకటరమణ,
న్యాయవాది,
శ్రీకాకుళం

మహారాజశ్రీ పార్వతీపురం సెకెండ్ ఎడిషినల్ జిల్లా జడ్జి కోర్టు వారి దివ్య సముఖనకు.
O.E.P.44/2022 IN O.S.12/2015

బిట్వీన్ :
బి.హెచ్.వి.రమణయ్య గుప్త ....డి.హెచ్.ఆర్
ఎండ్:
బి.వి.వి. రమణయ్య ......జె.డి.ఆర్
To
బోగి వైకుంఠ వెంకట రమణయ్య తండ్రి లేటు రమణయ్య, వయస్సు 62 సం॥లు, డోర్ నెం. 32-62, విశ్వబ్రాహ్మణ వీధి, బొబ్బిలి, విజయనగరం జిల్లా.

పై నెంబరు అమలులో యిందలి జె.డి.ఆర్ పై సొమ్ము రాబట్టి నిమిత్తం వేలం వేయించే నిమిత్తం అమలు దాఖలు చేసియున్నాను. సదరు అమలు వాయిదా **తేది.31-01-2023**కి వాయిదా అయి యున్నది. సదరు వాయిదా దినం పై కోర్టులో **ఉదయం 10-30 గం॥**లకు స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరు కావలయును లేని యెడల మీపరోక్షమందు తీర్మాణించబడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

పి.రాజేశ్వరరావు
గంటి గోపాలక్రిష్ణ శర్మ
D.Hr తరుపున వకీలు
బొబ్బిలి

బొబ్బిలి,
తేది. 11-01-2023